# పడగ తెగిన పాము

రవీందర్ బెజ్జారపు



చాలా సంవత్సరాల తర్వాత ఎందుకో మళ్ళీ 'రూట్స్' చదవాలన్పించింది. పుస్తకం తీశానో లేదో తలుపు చప్పుడయింది. ఎదురుగా ఉన్న ఇరవైఏళ్ళ పిలగాన్ని పోల్చుకోవడానికి చాలా ప్రయత్నించాల్సివచ్చింది. అతను నా చిన్నప్పటి క్లాస్‌మేట్ మారయ్య కొడుకు శేఖర్.

మారయ్య యూనివర్సిటీలో రీడర్‌గా పనిచేస్తున్నాడు. అపుడెపుడో ఐదేళ్ళ క్రితం ఒక సెమినార్‌లో తండ్రీ కొడుకులిద్దరు కలిశారు. ఇపుడిలా మారుమూల ప్రాంతంలో చిన్న లగేజితో ప్రత్యక్షం కావడం...ఆలోచనల్లో ఉండగానే నా చేతిలో ఉత్తరం పెట్టాడు.



మారయ్య రాశాడు. ఇంటర్‌నెట్ల కాలంలో చేతి ఉత్తరం! ... నవ్వొచ్చింది. అతడు ఇచ్చిన ఉత్తరం చదివాక రూట్స్ పుస్తకంలోంచి ఎలెక్స్ హెలీ శేఖర్ రూపంలో ఊడిపడ్డాడేమోనన్పించింది.

'... ... ... పిల్లలు డీబేస్ కావడమే నన్ను బాధిస్తోంది. వాళ్ళు తమ సంస్కృతికి పరాయిగా మారిపోతున్నారు. సరే, పాతదాన్ని ఏదన్న కొత్తది రీప్లేస్ చేసిందా అంటే అదీ లేదు. నా సమాజంలో, నా కల్చర్‌లో ఇన్‌వాల్వ్ చేయడం కోసం మా వాడ్ని పంపిస్తున్నాను. వాడు ప్రస్తుతం ఐఐటీలో చదువుతున్నాడు.

నా కల్చర్ నా కులంలోనే ఉందనిపిస్తోంది. అందరూ కులంలేని సమాజం గురించి కలలు కంటున్నారు. బట్ వాటీజ్ రాంగ్ విత్ ద క్యాస్ట్? కులానికి హోదాలు, స్థాయిలు నిర్ణయించడంలోనే ఉంది తప్పంతా. నా పూర్వీకులు తమ సంస్కృతినంతా కులంతో అటాచ్ చేశారు.

నాకు సంబంధించిన హిస్టారికల్ హీరోస్ గాని, కాల్పనిక పురుషుల చరిత్రగాని, సాహిత్యంగాని, కళలుగాని అన్నీ కులంతో అటాచ్ చేశారు. కులాన్ని కాదని నా సంస్కృతికి దగ్గర కావడం అసాధ్యం... ... ...' అంటూ ఎమోషనల్‌గా కొనసాగింది ఉత్తరం.

"ఇక్కడికి మీ డాడీ బలవంతం మీద వచ్చినట్టున్నావు" అన్నాను.

"లేదంకుల్ నా ఇంటరెస్ట్‌తోనే వచ్చాను. ఇందులో సిగ్గుపడాల్సిందేమి లేదనే అనుకుంటున్నాను. మొన్న మా ఫ్రెండొకడు జముకు నేర్చుకొని ప్రదర్శన కూడా ఇచ్చాడు" అన్నాడు. ఐఐటీ పిల్లల్ని జముకుతో ఊహించుకున్నాను.

శేఖర్ తండ్రి మారయ్య, నేను పదో తరగతి వరకు కలిసే చదువుకున్నాం. చాలా క్లోజ్‌గా ఉండేవాళ్ళం. పీజీ అయ్యాక మారయ్య లెక్చరర్ ఉద్యోగంలో చేరాడు. ఎప్పుడూ ఇటు వైపు రాని శేఖర్ అకస్మాత్తుగా చేతి ఉత్తరం పట్టుకొని వెతుక్కుంటూ వచ్చాడు.

మారయ్య రాసినదాని ప్రకారం ప్రతి కులం మీద ఆధారపడి ఒక ఉపకులం ఉటుంది. ఉపకులంలోని వాళ్ళ వృత్తి ఏమిటంటే తమను పోషిస్తున్న కులానికి సంబంధించిన చరిత్రను గానం చేయడం, ప్రదర్శించడం. శేఖర్ వాళ్ళ చాకలి కులానికి ఉపకులం పటాలోళ్ళు. పటాలోళ్ళు నాక్కూడా తెలుసు. వీళ్ళు చాకలి కులానికి సంబంధించిన మడేలయ్య కథని చెప్తారు. నేను కూడా వినడం తటస్థించింది. కాని అది చాలా సంవత్సరాల కిందటి మాట.

పెద్ద పటాన్ని ప్రదర్శిస్తూ మడేలయ్య కథను చెప్తారు. ఆ పటం కొన్ని మీటర్ల పొడవున సినిమా రీళ్ళలాగా బిట్స్‌తో ఉంటుంది. అద్భుతమైన జానపద రీతిలో ఉంటాయి బొమ్మలు. మా ఊళ్ళో అట్లాంటి పటం పటాలోళ్ళ నర్సయ్య దగ్గర ఉన్నట్లు తెలుసు. అది వంశ పారంపర్యంగా ఆస్తిలాగా సంక్రమిస్తుంది.

'... ... ... ఒక స్థాయికి వెళ్ళాక వెనక్కి తిరిగి చూడాలన్పిస్తుంది. పాత జ్ఞాపకాలు కొంత సిల్లీగా, ఇర్రేషనల్‌గా ఉన్నా అపురూపంగానే అన్పిస్తాయి. అందుకే శేఖర్‌ను అక్కడకు పంపిస్తున్నా. నర్సయ్య వాళ్ళింటికెళ్ళి పటాన్ని చూపించు. కథ చెప్పించు. నగర వాతావరణం తప్ప గ్రామీణ వాతావరణం తెలియదు. తమ పూర్వీకుల సంస్కృతితో ఏమాత్రం పరిచయం లేదు. మా వాడికి వాడి మూలాలు తెలియాలి. సిల్లీగా అన్పిస్తోందా... ... ...' ఉత్తరం ఎగ్జైటింగ్‌తో రాసినట్టున్నాడు.

సిల్లీగా కాదుగాని కొంత కన్ఫ్యూజింగ్‌గా ఉంది. నాస్తికుడైన మారయ్య దేవుడి కథల కోసం కొడుకును ఇంత దూరం పంపించాడు. అందరినీ కనిపెట్టుకొని ఉండే అతీతశక్తిలాగా కాకుండా, రవీంద్రనాథ్ ఠాగూర్ సఖుడు, స్నేహితుడనే భావంలాగా కాకుండా దేవుడిని సంస్కృతిలో ఒక భాగంలాగా మాత్రమే చూడాలనే భావన కొంత విచిత్రంగానే అన్పించింది.

"ఎలాగు చీకటి పడింది. రేపు పొద్దున నర్సయ్య ఇంటి కెళదాం" అన్నాను. భోజనం చేశాక ముచ్చట్లలో పడ్డాం.

ఎల్లమ్మ గుడి పక్కనున్న కల్లు మండువాకి కొద్ది దూరంలో ఉంది పటాలోళ్ళ నర్సయ్య ఇల్లు. గూనపెంకుల ఇళ్ళు... ముందర పందిరి, చుట్టూ పేర్చిన రాళ్ళగోడ. పరిసరంలోని ప్రతి విషయాన్ని ఆసక్తిగా పరిశీలిస్తున్నాడు శేఖర్. మేము వెళ్ళేసరికి వాకిట్లో నర్సయ్య నిల్చొని ఉన్నాడు. అతని ముందున్న మంచం మీద ఇద్దరు కొత్త వ్యక్తులు కూర్చొని ఉన్నారు. మమ్మల్ని చూడగానే నర్సయ్య నమస్కారం చేశాడు. వాళ్ళ మనుమని పిల్లలు మా స్కూల్లోనే చదువుకుంటున్నారు. ఇంకో మంచం వేశాడు. మేం దానిపైన కూర్చున్నాం. శేఖర్ వచ్చిన పని చెప్పాను.

"మీ పటాన్ని చూసి కథను వినాలనుకుంటున్నాడు. మీకెపుడు వీలవుతుందో చెప్పండి. శేఖర్ తండ్రి మారయ్య కొత్తోడేం కాదు కదా" అన్నాను.

"అయ్యో సారు! ఆ పటం కొనటానికే ఈ సార్లు పట్నం నుంచి అచ్చిన్రు" అన్నాడు నర్సయ్య. నిరాశపడ్డాం ఇద్దరం.

శేఖర్ ఒక్కసారిగా డీలాపడిపోయాడు. వచ్చినవాళ్ళు పరిచయం చేసుకోక తప్పింది కాదు.

"నా పేరు అమరేందర్‌రెడ్డి. సిటీలో కళా యాంటెక్స్ షాప్ ఓనర్ని. లైసెన్స్

